## అంగరంగ వైభవంగా కట్ట కింద పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన

### -ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

**అమీన్‌పూర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ ప్రతి ఒక్కరిలో దైవ చింతన పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్‌లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ కట్ట కింద పోచమ్మ దేవాలయంలో అంగరంగ వైభవంగా జరిగిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కవిత శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, మాఖం మల్లేష్, లింగం గౌడ్, భాస్కర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

### సెప్టెంబర్ 1న సబ్ జూనియర్ జిల్లా

## బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

**మిరుదొడ్డి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్-15 సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక సెప్టెంబర్ 1న నిర్వహించడం జరుగుతుందని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.భైరయ్యలు బుధవారం తెలిపారు. 2010 జనవరి తర్వాత జన్మించిన క్రీడాకారులు ఇట్టి ఎంపికలో పాల్గొనేందుకు అర్హులు అన్నారు. బిహెచ్‌ఈఎల్ ఓల్డ్ ఎంఐజీలో ఎంపికలు నిర్వహించడం .జరుగుతుందన్నారు. జిల్లా జట్లు వచ్చే నెల 14 నుంచి 15 వరకు నిర్వహించే రాష్ట్ర సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు మెదక్ ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. 3 పాస్ ఫోటోలతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకరావాలన్నారు. పూర్తి వివరాలకు 9440703038, 9704746511 నంబర్లను సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

## నిర్ణీత వ్యవధిలో 'మహిళా శక్తి' లక్ష్యాలు సాధించాలి

### -జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని నిర్ణీత వ్యవధిలో లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. బుధవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులనులో భాగంగా స్కూల్ యూనిఫామ్స్ కుట్టు పని, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం 13 రకాల పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఆగస్టు నెలా ఖరువరకు మంజూరైన పథకాలు గ్రౌండ్ అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోని ఏపిఎంలపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని పిడి డిఆర్‌డిఓ అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి రుణాల కొరకు కలెక్టరేట్‌కు రాకుండా క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మండలాల వారిగా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండిగ్‌ప జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిఆర్‌డిఓ జ్యోతి, మెప్మా పిడి గీత, ఆయా గ్రామాణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖల డిపిఎం, ఏపిఎంలు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

### -విద్యార్థులతో కలిసి ట్రైనీ కలెక్టర్, డీఈఓ సహపంక్తి భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ట్రైనీ కలెక్టర్, డీఈఓ

**మునిపల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బుదేరా గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం, లింగంపల్లి గురుకుల పాఠశాలలను బుధవారం ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఈఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ దశరథ్‌లు సందర్శించారు. ఆయా పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. క్రమశిక్షణతో విద్యను ఆర్జిస్తే ఉన్నతలుగా ఎదగడం తథ్యమని సూచించారు. గురుకుల పాఠశాల మరుగుదొడ్లను, గదునలు, భోజన శాలను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

## రంగంపేట పిహెచ్‌సిని డిఎంహెచ్‌వో తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

**కొల్చారం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీరామ్ అన్నారు. బుధవారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజనతో కలిసి డీఎంహెచ్‌వో శ్రీరామ్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రంగంపేట ప్రాథమి కేంద్రం వైద్యాధికారి హర్షితతో కలిసి వైద సిబ్బందితో వైద్య సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో చికిత్సకు అవసరమైన మందుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో శ్రీరామ్ మాట్లాడుతూ వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఆసుపత్రికి వచ్చి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలితే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యనరకమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హర్షిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిరుదొడ్డిలో నేడు 2కె రన్

**మిరుదొడ్డి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** క్రీడాదినోత్సవం సందర్భంగా ఈనెల 29న 2కే రన్ నిర్వహించడం జరుగుతుందని భూంపల్లి పిఈటి తోట వెంకటరెడ్డి తెలిపారు. జాతీయ క్రీడ దినోత్సం సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని భూంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో రెండు కిలో మీటర్ల పరుగుపందెం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఆసక్తిగల 12 నుంచి 30 ఏళ్ల వయస్సుగల యువతి, యువకులు పాల్గొనాలన్నారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 29న ఉదయం 9 గంటల వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూంపల్లికి రావాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు వంశీచందర్‌రెడ్డి, ఉమారాణి, ఎస్ఐ హరీష్‌గౌడ్ హాజరవుతారని తెలిపారు. పూర్తి వివరాలకు 9908693599ను సంప్రదించాలన్నారు.

# విషజ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవాలి

### ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు ఉంచాలి...బ్లడ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి.. మెదక్ ఎంపి రఘునందన్‌రావు




మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో డెంగ్యూ, విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేసి కట్టడి చేయాలని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి,కో-ఆర్డినేషన్, మానిటరింగ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.అన్ని ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో రెండు కొత్తగా బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారురాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు రోగులకు అందించడంలో ప్రైవేటు ఆసుపత్రులు ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం అమలు చేసే ప్రతి పథకాన్ని సకాలంలో అర్హులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాలు అమలు చేసే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోతుందని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసే క్రమంలో తూకం విషయంలో ఇబ్బందులు రాకుండా ఐకెపి, స్వయం సహాయక సంఘాలకు స్పష్టమైన అవగాహన కల్పించడానికి శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లులపై తనిఖీలు చేపట్టి జరిగిన కొనుగోలు ప్రకారం ధాన్యం వివరాలు తెలుసుకోవడంతోపాటు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.బీడీ కార్మికుల పెన్షన్ కోసం వచ్చిన దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మించిన మల్లన్న, కొండపోచమ్మ, రంగనాయకసాగర్ కట్టడాల నిర్మాణాలకు మట్టి ఎక్కడి నుంచి తెచ్చారాని.. సంబంధిత కాంట్రాక్టర్ మైనింగ్ శాఖకు ఎంత పేమెంట్ చేశారో పూర్తి వివరాలు అందించాలని సంబంధిత శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్సీ డా॥యాదవరెడ్డి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి డిటీవో కొండల్‌రావు, వివిధ ప్రభుత్వశాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దళితులతో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

## దళితులపై కుల వివక్ష సరికాదు

### కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్

**మర్కుక్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** మండలంలోని శివారువెంకటాపూర్ గ్రామంలో దళితులపై కులవివక్ష చూపించడం సరికాదని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్ అన్నారు. గ్రామంలో దళితులు దుర్గమ్మ పండుగ సందర్భంగా బోనాలు తీయడానికి సిద్ధం కాగా గ్రామస్తులు పలువురు అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామాన్ని సందర్శించిన కెవిపిఎస్ నాయకులు దళితులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ నాలుగైదు రోజుల క్రితం సంఘటన జరిగినప్పటికీ ఇంతవరకు అధికారులు గ్రామాన్ని సందర్శించి జరిగిన సంఘటనపై చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉమ్మడి జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్, చాట్లపల్లి, ఇటిక్యాల గ్రామాల్లో కుల వివక్ష కొనసాగుతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 30వ తేదీన పౌర హక్కుల దినాన్ని మండలకేంద్రాల్లో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మరాటి కృష్ణమూర్తి, డివిజన్ నాయకులు వెంకటేస్, మర్కుక్ మండల అధ్యక్షుడు పొట్టొల్ల దాసు, గ్రామస్తులు ఎల్లమ్మ, మల్లమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

### నేడు శివారువెంకటాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం

**మర్కుక్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని శివారువెంకటాపూర్ గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ ఆరీఫా ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల యూత్ భవనంలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గ్రామస్తులు అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.



ఎంపి రఘునందన్‌రావుతో బిజెపి మండల అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు

## మైసమ్మ ఆలయ భూమిని కాపాడాలి

**మర్కుక్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలం కర్కపట్ల గ్రామంలోని మత్తడి మైసమ్మ అమ్మవారి ఆలయ భూమి కబ్జాకు గురైందని, కబ్జాకు గురైన భూమిని కాపాడాలని మర్కుక్ మండల బిజెపి అధ్యక్షుడు రాంరెడ్డి బుధవారం కర్కపట్ల గ్రామస్తులతో కలిసి ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపి రఘునందన్‌రావును కలిశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని ఆలయ భూముల పరిరక్షణకు కృషిచేయాలని రఘునందన్‌రావును కోరినట్లు పేర్కొన్నారు.

## కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడండి

**జహీరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మొగుడంపల్లి మండల పరిధిలోని మాడ్గి గ్రామంలోని సర్వే నంబర్ 68, 78, మధ్యలో ఉన్న 33 ఫీట్ల ప్రభుత్వ తోవను కొంతరు కబ్జా చేసుకున్నారిన గ్రామస్థులు బుధవారం ఆర్‌డిఓకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సర్వే నంబర్ 78లోని పట్టాదారు తమ భూమిని ప్లాట్లుగా విభజించి వ్యవసాయేతర భూమిగా మార్చుటకు అనుమతి కోరుతూ రెవిన్యూ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకున్నారన్నారు. సర్వే నంబర్ 68,78 మధ్యన ఉన్న 33 ఫీట్ల దారిని మూసేసి లెవల్ చేసినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆర్‌డిఓకు వినతి పత్రం అందచేసినట్లు మాడ్గి గ్రామస్థులు పేర్కొన్నారు.



ఆర్‌డిఓకు వినతి పత్రం అందచేస్తున్న మాడ్గి గ్రామస్థులు

# నీరు గారుతున్న ప్లాస్టిక్ నిషేధం

### ఎక్కడికక్కడే ప్లాస్టిక్‌ను కాలుస్తున్న వైనం నామమాత్రంగా అధికారుల తనిఖీలు



**నారాయణఖేడ్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌కవర్లను వాడకూడదని ప్రభుత్వం ప్రజలకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చెప్పినా ఫలితం లేకుండాపోయింది. ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీయడం భూతాపం పెరగడంతో పాటు పలు విపత్తులకు కారణమయ్యే నాణ్యత లేని పాలిథిన్ (ప్లాస్టిక్) ఉత్పత్తులపై ప్రభుత్వం నిషేధించినా అది మూడునాళ్ల ముచ్చటగా మారింది. ఇటీవల ప్రభుత్వం అమలుచేస్తున్న స్వచ్చదనం పచ్చదనంలో భాగంగా అధికారులు ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేయాలని స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాల్సి ఉండగా అది నామమాత్రంగానే జరగటం మరింత సమస్యగా మారింది. అంతేకాకుండా మున్సిపాలిటీ, పంచాయతీ కార్యాలయాల నుంచి తీర్మానం చేసి నిషేధించినా ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని నోటీసులు సైతం అధికారులు జారీ చేశారు. వ్యాపారులపై అధికారుల నిఘా వైఫల్యమో మామూళ్ల మత్తులో అదికారులతో కొందరు వ్యాపారం దోస్తానమో కాని తిరిగి నాణ్యత లేని ప్లాస్టిక్ ఉత్పత్తులను ఆయా షాపుల్లో దర్జాగా విక్రయిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపటిట్టిన కార్యక్రమం ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీవరకు స్వచ్ఛదనం పచ్చదనం అనే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. మున్సిపల్ అధికారులు, ఆయా పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు ఎక్కడా నిర్వహించలేదు.

**విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు...**

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాల్లో, గ్రామాల్లో, గిరిజన తండాల్లో నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లు ఇతర ఉత్పత్తుల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు మొదలుకుని హోటళ్లు, దాబాలు, కిరాణ, కూరగాయాల తదితర దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లనే అధికంగా వాడుతున్నారు. రోజుకు సగటున ఆయా షాపుల్లో లెక్కిస్తే క్వింటాళ్ల పాలిథిన్ సంచుల విక్రయం సాగుతుందని అంచనా.

**పాలిథిన్ సంచులతో అనర్థాలు...**

పాలిథిన్ సంచులు ఏళ్లతరబడి భూమిలో కరిగిపోకుండా ఉండటంతో విపరీతమైన భూతాపం పెరుగుతుంది. వర్షకాలంలో కాల్వల్లో, డ్రైనేజీల్లో నీటి వరద ప్రవాహన్ని అడ్డుకుని సమస్యలను సృష్టిస్తాయి. నాణ్యత లేని ప్లాస్టిక్ గ్లాసులు ఇతర ఉత్పత్తుల్లో టీ(చాయి), వేడి ఆహారపదార్థలు మనుషులు తినడంతో పలు రకాల వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెప్పినా ప్రజలు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ కేంద్రంతో పాటు మండల కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాల్లో ప్రజలు వినియోగించిన వ్యర్థ పాలిథిన్ కవర్ల ప్యాకెట్లను బహిరంగ ప్రదేశాల్లో కాల్చడంతో వాటి నుంచి వెలువడిన పొగ ద్వారా విషపూరితమైన వాసన కారణంగా శ్వాసకోస వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**మూగజీవాలకు ప్రాణ సంకటగా మారిన ప్లాస్టిక్...**

హోటళ్లలో కూరగాయాలు, పండ్లు ఇతర అల్పాహారాలకు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు సంచులలో మిగిలిపోయిన ఆహార పదార్థల కోసం మూగజీవాలు వాటిని తినడంతో కడుపులోకి వెళ్లి వాటికి ప్రాణ సంకటగా మారుతున్నాయి. హోటళ్ల యజమానులు చిరు వ్యాపారులు తమ తమ వ్యాపారాల్లో మిగిలిపోయిన వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో వేయడంతో అక్కడికి వెళ్లిన మూగజీవలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో అంటిముట్టనట్లు వ్యవహరించడంతో మూగజీవలు మృత్యువాత పడుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ నిత్యం ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లు ఇతర ఉత్పత్తులను విక్రయించడం వినియోగించకుండా అధికారులు అవగాహన కల్పించాల్సి ఉండగా అవేవి పట్టనట్లు వ్యవహరించడం అధికారుల పనితీరుకు నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి తగ్గించి పర్యావరణ సమతుల్యతని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## క్రీడాకారులను పట్టించుకోని గత ప్రభుత్వం

### ప్రపంచ చదరంగం క్రీడాకారిణి పల్లె అంకితగౌడ్ ఆవేదన

**రామాయంపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త :** రామాయంపేట పట్టణానికిచెందిన క్రీడాకారిణి పల్లె అంకితగౌడ్ అంతర్జాతీయస్థాయిలో రాణిస్తూ దేశానికి, పుట్టినగడ్డకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తున్నారు. అయితే గత ప్రభుత్వం ఆమెను ప్రోత్సహించకపోవడంతో సొంతంగానే వివిధ దేశాలకు వెళ్లి చదరంగం పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించారు. స్థానిక మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అయిన పల్లె రామచంద్రగౌడ్ కుమార్తె అంకితగౌడ్ ప్రపంచ చదరంగం క్రీడాకారిణి. పల్లె అంకితగౌడ్ స్కూల్, కాలేజీ, యూనివర్సిటీ టోర్నమెంట్లో పలుమార్లు పాల్గొని ప్రతి దాంట్లో సెలక్షన్ అవ్వుకుంటూ యూనివర్సిటీ ఉస్మానియా యూనివర్సిటీ తరపున రెండుసార్లు, నేషనల్ సెలెక్ట్ అవడం జరిగింది. యూనివర్సిటీ ఇంటర్నేషనల్ తరపున కూడా పాల్గొనడం విశేషం. అంకితగౌడ్ ఎల్లో రేటింగ్ 2000 ప్లస్ ఉంటుంది. రేటింగ్ ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో మహిళల్లో కూడా చాలా తక్కువగా ఉంటారు. డబ్బుతో కూడుకున్నది కావడంతో ఎక్కువమంది క్రీడాకారులు రాణించలేకపోతున్నారు. ఎక్కువ టోర్నమెంట్లకు, ఎంట్రీ ఫీజులు, విదేశీ పర్యటన దేశంలో టూర్లు పోవడానికి అంకితగౌడ్ సొంత ఖర్చులతో పాల్గొనడం జరుగుతుంది. చదరంగం పోటీల్లో రాణించడానికి కోచింగ్‌కు గంటకు రూ. 1000 పైనే ఖర్చు చేయవలసిన అవసరం ఉంటుందని అంకితగౌడ్ నాన్న పల్లె రామచంద్రగౌడ్ తెలిపారు. విదేశీ పర్యటనలో భాగంగా ఇప్పటివరకు యూరప్ టోర్నమెంట్స్, సెర్బియా విదేశీ పర్యటనలు సుమారుగా 8 దేశాల్లో అంకితగౌడ్ పాల్గొన్నారు. కామన్వెల్త్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొనడం జరిగింది. గ్రామీణ స్థాయి నుంచి వెళ్లిన వారు చాలా తక్కువ మంది ఉంటరు. వీరందరికి ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం ఇవ్వాలని ఆమె కోరారు. గత ప్రభుత్వాలు కొంతమంది క్రీడాకారులకు భూములు, ఆర్థిక వనరులు కల్పించడం జరిగిందని, కొంత మందిని ప్రోత్సహించడం జరిగిందని, అదికూడా ఒకరిద్దరికి మాత్రమేనని రామచంద్రగౌడ్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తక్కువ ఉన్న వారికి కూడా ప్రోత్సహించడం జరిగిందని, ప్రతి ఒక్క క్రీడాకారున్ని ప్రోత్సహించి, ఉన్నతంగా ఉన్నవారికి ప్రభుత్వం అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే అన్ని క్రీడలకు ప్రోత్సహించి, వారికి సపోర్ట్‌గా ఉండాలని, క్రీడాచట్టం తీసుకొచ్చి ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలని, స్కూల్లో ప్రతి ఒక్కరు పాల్గొనే రకంగా చూడాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రోత్సహించే రకంగా క్రీడాకారులకు భూములను, ప్లాట్లను, ఆర్థికవనరులు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన సూచించారు. ప్రపంచ క్రీడాకారిణిగా అంకితగౌడ్ పేరు సంపాదించుకున్నారు. గత 10 ఏళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడాకారుల గురించి ఎంతమాత్రం పట్టించుకున్న పాపానపోలేదని ఆయన దుయ్యబట్టారు. తన కుమార్తె విషయంలో అపనపటగి ప్రభుత్వము వివక్షత చూపించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అందరూ క్రీడాకారులను ప్రోత్సహించే రకంగా ప్రభుత్వం వారికి ఆర్థిక వనరులు కల్పించాలని, వాళ్లకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు ఏర్పరచాలని రామచంద్రగౌడ్ ప్రభుత్వానికి సూచించారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### -జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం



పాపన్నపేట ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ శ్రీరాం

**పాపన్నపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వైద్య సిబ్బంద విధి నిర్వాహణలో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరాం మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు అందుకోవాలని ప్రజలకు సూచించారు. ఆరోగ్య కేంద్రంలో సేవ గురించి రోగులను శ్రీరాం అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రికార్డులను, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ప్రదీప్‌రావు, సారిక, సిహెచ్ఓ చందర్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఈత సరదా.. ఇద్దరు యువకులు బలి

### -మాసాయిపేటలో విషాదం

**వెల్దుర్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఈత సరదా ఇద్దరు యువకులను బలిగొన్న సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేట గ్రామ శివారులోని వ్యవసాయ గోదాముల పక్కన ఉన్న క్వారీ నీటి గుంటలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట గ్రామానికి చెందిన డప్పు నవీన్ (22), నెల్లూరు రాము(26) కలిసి మంగళవారం గ్రామ శివారులోని ఓ క్వారీ నీటి గుంటలో ఈత కొట్టడానికి వెళ్లారు. ఇద్దరు నీటిలోకి దిగగా వారు గల్లంతయ్యారు. ఇది గమనించిన అదే గ్రామానికి చెందిన డప్పు నవీన్ అన్న బాలనర్సు సమాచారాన్ని గ్రామంలోకి చేరవేశాడు. బుధవారం మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాలను గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టగా యువకుల మృతదేహాలు లభించాయి. ఘటన స్థలానికి చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి చేరుకొని విచారణ చేపట్టారు. డప్పు నవీన్ అన్న బాలనర్సు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంట తడి పెట్టించాయి. ఈ విషయం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డికి తెలియడంతో బాధిత కుటుంబాలకు 5 వేల చొప్పున 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

**వెల్దుర్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఐబీ కార్యాలయం ముందు బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన పెద్ది మనోహర్(25) అతివేగంతో ద్విచక్ర వాహనం నడపడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని క్రింద పడటంతో తలకు తీవ్ర గాలయాల్యాయి. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఏఎస్ఐ సాదత్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరొక ద్విచక్ర వాహనంపైగల వెల్దుర్తి గ్రామానికి చెందిన హెచ్.కిష్టాగౌడ్‌కు గాయాలయ్యాయి.

## రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజాసింగ్

**గోషామహల్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** భాగ్యనగర్ శ్రీకృష్ణాజన్మాష్టమి ఉత్సవ సమితి ఉస్మాన్‌షాహి ఆధ్వర్యంలోఅంగరంగ వైభవంగా కృష్ణభగవానుడికి గోషామహల్ నియోజకవర్గం బిజెపిశాసనసభ్యులు టి.రాజాసింగ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవ శోభయాత్రను ప్రారంభించారు. బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్, హైదరాబాద్ పార్లమెంట్ బిజెపి ఇన్‌చార్జ్ మాధవిలత, కాంగ్రెస్ నాయకులు పి.సంతోష్‌గుప్త తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. జంగల్ విఠోభా దేవాలయం నుంచి ప్రారంభమైన గౌలిగూడ చమన్, ఉస్మాన్‌షాహి, జాంబాగ్‌లోని యాదవసంఘం వరకు కొనసాగింది. ఈవేడుకల్లో రాధకృష్ణున్ని ప్రతిమలు చూడ ముచ్చటగా కనిపించాయి. శోభయాత్రలో ముందు వరుసలో వినాయక పత్రిమ, అమ్మవారు. భక్తులను ఎంతో ఆకట్టుకుంది . కేరళ నుంచి వచ్చిన బ్యాండ్‌మేళాలు, మంగళ వ్యాయిదాలు మధ్య, మహిళ కొలోహటల మధ్య శోభయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవ సమి తి నిర్వాహకులు బోయిని వెంకటేష్‌యాదవ్, జె.సంతోష్ యాదవ్, సందీప్‌యాదవ్, ఎస్. శ్రీశైలంయాదవ్, ఎన్. దిలిప్‌యాదవ్, బి.కపిల్‌యాదవ్, జె.హరిష్, జి.రవియాదవ్, బి.జశ్వంత్‌యాదవ్, యాదవులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## ఉస్మానియా దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ ఎస్.ఎస్.యాదవ్

**బేగంబజార్, ఆగస్టు 28ప్రభాతవార్త:** ఉస్మానియా ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్‌గా ఎస్.ఎస్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్.ఎస్.ఎస్ యాదవ్‌ను నియమిస్తూ ఉత్తర్వులుజారీ చేశారు. ప్రస్తుత దంత వైద్య కళాశాల కన్జర్వేటర్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న యాదవ్ దాదాపుగాముడు దశాబ్దాలుగా విధులను నిర్వహిస్తున్నారు. సీనియర్ ప్రొఫెసర్‌గా వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ఎస్.ఎస్‌యాదవ్‌ను నియమించడంతో ఆసుపత్రిలోని వివిధ విభాగాల వైద్యులు సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్చాలు అందచేశారు. భాధ్యతలు చేపట్టిన ఎస్.ఎస్.యాదవ్ మాట్లాడుతూ దంత సంబంధిత సమస్యలతో ఆసుపత్రికివచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే దంతసేవలు అందిస్తున్న పెద్దా ఆసుపత్రిగా ఖ్యాతిగాంచిన ఉస్మానియా దంత వైద్య కళాశాలలో బిడిఎస్, ఎండిఎస్‌వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు. దంత వైద్యకళాశాలలోని సీనియర్ వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటానన్నారు.

## సమస్య పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

**నాచారం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** నాచారం కార్తికేయనగర్ స్ట్రీట్ నెం.10 లో రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంజనీర్ రూప, ఇంచార్జి అసిస్టెంట్ ఏఈ స్రవంతితో కలిసి కార్తికేయ నగర్ స్ట్రీట్ నెం.10లో పర్యటించారు. వివిద కారణాల వల్ల సుమారు 40 మీటర్ల తక్కువ రోడ్డు వేస్తుండటంతో కాలనీ వాసులు ఆందోళనకు గురై పనులను ఆపివేయించారు. దీంతో స్థానికుల ఫిర్యాదుతో తాను ఇక్కడికి రావడం జరిగిందని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. దీంతో తాను సమస్యను తెలుసుకునేందుకు తాను ఇక్కడికి రావడం జరిగిందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మిగిలిన 40 మీటర్ల మేరకు కూడా రోడ్డును వేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. త్వరలో మొత్తం రోడ్డును ఎట్టిపరిస్థితిలో కూడా వేసే విదంగా చూస్తానని స్థానికులకు కార్పొరేటర్ హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్‌త, దానం, చిరు, కాలనీ వాసులు మల్లారెడ్డి, శ్రీనివాస్, కెవిన్, ప్రసన్న, వర్క్ ఇన్స్‌పెక్టర్ విజయ్ కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా మీట్‌కు ఎంపికైన విద్యార్థులు



అత్తాపూర్ ఆగస్టు28, ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి పిఎం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ఐఐటి కాన్పూర్‌లో జరిగే కెవిఎస్ 53వ జాతీయ క్రీడా మీట్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. బుధవారం విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ డా.టివి శర్మ మాట్లాడారు...సెప్టెంబర్ 11 నుండి 15 వరకు ఐఐటి కాన్పూర్‌లో జరిగే కెవిఎస్ జాతీయ క్రీడా మీట్‌కు బాస్కెట్ బాల్ విభాగంలో ఆశిష్ నెహ్రు, వివేక్ రావత్, భావ్య, రోషిణి, స్కెటింగ్ విభాగంలో శ్రీశాంత్, బాక్స్ంగ్‌లో నమన్, అట్లాటిక్స్‌కు తూషారలు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం విద్యార్థులను డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఓ.యూ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్‌గా ప్రొ.జహంగీర్

**తార్నాక, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నూతన హెడ్‌గా సీనియర్ ప్రొ.జహంగీర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం భాధ్యతలు స్వీకరించారు. ప్రొ.జంహంగీర్ గతంలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఒయూ గెస్ట్‌హౌజ్ డైరెక్టర్‌గా భాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు, మాజీ డీన్ వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొ.స్మిత సంబ్రాని, ప్రొ.సుధ, ప్రొ.ప్యాట్రిక్, కవితాదేవి, రంజని, డాక్టర్, జి.శ్రీనివాసరావుతో పాటు పలువురు పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర డిజిపికి దట్టీ కట్టిన పాతబస్తీ బిజెపి నాయకుడు



రాష్ట్ర డిజిపి డాక్టర్.జితేందర్‌ను బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ కలిసినప్పటి చిత్రం

**చార్మినార్, ఆగష్టు 28 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో షియా ముస్లింలు నిర్వహించిన అర్బైన్ ఊరేగింపు ప్రశాంతమైన వాతావరణంలో ముగిసిందని, ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు ధన్య వాదాలు తెలియజేస్తున్నానని బిజెపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. పాతబస్తీలో ఆగస్టు నెల 26వ తేదీన అర్బైన్ ర్యాలీతో పాటు మొహర్రం సంతాప దినాలు ప్రారంభం నుంచి అన్ని ఏర్పా ట్లు చేసినందుకు రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్‌ను కలిసి దట్టీలు కట్టి ధన్యవాదాలు తెలియజేశామని బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలియజేశారు.

## నేడు రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ క్రీడల దినోత్సవ వేడుకలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కే.శివసేనారెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించలేనంత విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ కే.శివసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఎల్‌బి స్టేడియంలో 'ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ 2024' పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయనతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డితో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 29 జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు జిల్లాల్లో క్రీడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా గురువారం గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవ నిర్వహణ ఘనంగా జరుగుతుందన్నారు. 33 జిల్లా కేంద్రాల్లో యువజన శాఖ నిర్వహణలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ వైభవం నిర్వహించాలని ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు జాతీయ క్రీడా ఉత్సవాలను ప్రోత్సహించాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పోస్టర్లు, టీ షర్టులను ఆవిష్కరించారని కే.శివసేనారెడ్డి వివరించారు. గచ్చిబౌలి స్టేడియంలో గురువారం ఇంటర్ కాంటినేంటల్ ఫిఫా కప్ 2024కు హైదరాబాద్ నగరం ఆతిధ్యం ఇవ్వబోతున్నదని, ఇండియా మారిషన్ దేశాల మధ్య సెప్టెంబరు 3, 6, 9 తేదీలలో జంరగబోయే ఈ పోటీలకు తమ సంస్థ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నదన్నారు. జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలకు హైదరాబాద్ నగరం వేదిక కాబోతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.పాల్గుణ, డిప్యూటి డైరెక్టర్లు అనురాధ, చంద్రారెడ్డి, రవీందర్, శ్రీలత, సూర్యలత, సుజాత, ఇంజనీర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సన్మార్గ దిక్సూచి సంజవెలుగు సాంఘిక నాటకం

**రవీంద్రభారతి, ఆగస్టు 28 ప్రభాతవార్త :** ఆధునిక యాంత్రికయుగంలో మానవ ప్రేమ, ఆత్మీయానురాగాలను మృగ్యంచేస్తూ పిల్లలకు తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు ఆదాయం మీద ఉన్న శ్రద్ధ వారి ఆలనా పాలనా మీద కొరవడి పనిమనుషులకన్నా హీనంగా చూస్తూ అనాథాశ్రమాల్లో వదిలేసే సంస్కృతిని నివారించి జీవన సంధ్యాకాలంలో వారికి వెలుగునింపి వికృతిలో పయనిస్తున్న నేటి సమాజాన్ని ప్రకృతిలోకి నడిపించేందుకు చేసిన ప్రయత్నమే సంజవెలుగు సమకాలీన సాంఘిక పద్యనాటకమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. ప్రముఖ సాంస్కృతిక హైదరాబాద్ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో తడకమళ్ళ రామచందర్ రావు రచన, డా. వెంకట్ గోవాడ దర్శకత్వం, ఆయా పాత్రధారులు శ్రీనివాసరావు, సురభి వెంగమాంబ, భాగి శివశంకరశాస్త్రి, సురభి ప్రభావతి, మురళి, నాగేశ్వర రావు, శ్యామ్‌ప్రసాద్, పుండరీకి, బి.ఎల్.లక్ష్మీశ్రీరాం తదితరుల అద్భుత నటనలో రూపొందిన సంజవెలుగు నాటకం శ్రీకళానికేతన్ హైదరాబాద్ వారి సమర్పణలో అద్భుతంగా ప్రదర్శింపబడి అశేష వీక్షకులమన్ననలు, ప్రశంసలందుకుంది. చివరిగా కళాకారులను ఘనంగా సన్మానించారు.

## అక్రమ కట్టడాలపై అధికారులతో డిప్యూటీ మేయర్ సమావేశం

**తార్నాక, ఆగస్టు 28 ప్రభాతవార్త:** చెరువుల ఆక్రమణ.. అక్రమ కట్టడాలపై అధికారులతో బుధవారం క్యాంపు కార్యాలయంలో నగర డిప్యూటీ మేయర్ సమావేశమయ్యారు. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లోని చెరువు ఆక్రమణ, నాలాలపై ఆక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డిప్యూటీ మేయర్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వరద నీరు చెరువులోకి చేరకుండా ఆక్రమదారుల దుశ్చర్య వల్ల చెరువులోకి చేరాల్సిన వరద నీరు కాలనీల్లో ప్రవేశిస్తుందన్నారు. చురువులో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై హైడ్రాకు సమాచారం అందించాలని సూచించారు. చెరువులకు సంబందించిన లేఅవుట్‌ను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేసి సర్వే నిర్వహించి చెరువులను కాపాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి తహసిల్దార్ భీమయ్య గౌడ్, సర్కిల్ ఏసీపీ శ్రీనివాస్ రావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, టిపిఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజంలో నిజాయితీగా పనిచేసిన వ్యక్తి దత్తాత్రి

### -మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** జర్నలిజంలో నిజాయితీగా పనిచేసిన వ్యక్తి బిట్ల దత్తాత్రి అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దత్తాత్రేయ సన్నిహితులు, స్నేహితుల ఆధ్వర్యంలో ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. దీనికి మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, టియూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీతో పాటు పలువురు ప్రముఖులు హాజరై దత్తాత్రేయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా జర్నలిజంలోఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్‌నేత ఎంఎన్ శ్రీనివాస్‌రావు, సీనియర్ పాత్రికేయులు గడ్డం నరసింహ రావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రాజేష్, హెచ్‌యుజే నగర అధ్యక్షులు శంకర్, మారుతీ సాగర్, అబ్బయ్యగౌడ్, చారి, బొల్లం శ్రీనివాస్, వీరారెడ్డి, శ్యాంసుందర్‌లతోపాటు దత్తాత్రేయ సతీమణి నిర్మల కూతుళ్ల శ్రావణి, హరిణి పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీశైలం

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష లుగా హైకోర్టు అడ్వకేట్ నాగర్‌క ర్నూల్ జిల్లా బిజినాపల్లి మండలం బోయాపూర్ దాసర్ల శ్రీశై లం నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్ పిడ మర్తి రవి శ్రీశైలం పేరును ప్రకటించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులందరినీ ఏకం చేసి మండలస్థాయి నుంచి జిల్లాస్థాయిలో కమిటీలు వేసి బలోపేతం చేయాల న్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఉద్యమకారులందరికీ ప్రత్యేక గుర్తింపు ఇస్తూ 250 గజాల ప్లాట్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు దాసర్ల శ్రీశైలం మాట్లాడుతూ నాడు తెలంగాణ కోసం అనేకమంది ఉద్యమకారులు నిర్బంధాలను ఆంక్షలను లెక్కచేయకుండా ఉద్యమం చేసి జైలు కెళ్తే ఒకే కుటుంబం వల్ల తెలంగాణ వచ్చినట్లు చిత్రీకరించారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం హామీ ఇవ్వడం గర్వకారణమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీ నెరవేర్చాలని ప్రభు త్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర చైర్మన్‌గా ఈఉపేందర్, కన్వీనర్‌గా సలీమ్ పేర్లను పిడమర్తి రవి ప్రకటించారు.

## ఆదర్శ ఫౌండేషన్ సీల్‌వెల్ గాయకుల సినీసుస్వరాలు

**చిక్కడపల్లి, ఆగస్టు 28ప్రభాతవార్త:** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, ఆదర్శ ఫౌండేషన్, ఆర్‌ఆర్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సీల్‌వెల్ సినీ సుస్వరాల' కార్యక్రమంలో భాగంగా 'ప్రతిభకు పట్టం–గౌరవ సన్మానాలు' కార్యక్రమం ప్రముఖ గాయనీ ఆమని, శృతిలయ ఆర్ట్స్ చైర్మన్ డాక్టర్ బొక్కా భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా కథక్ కళాక్షేత్ర అధినేత పండిట్ అంజుబాబు, వ్యాఖ్యాత పిఎంకె.గాంధీ, సీనియర్ గాయనీ కమలశాస్త్రి, ప్రముఖ సంఘసేవకులు పన్నాల బాల్‌రెడ్డిలను ఘనంగా సత్కరించి అభినందించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త హాజరై వీరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కుసుమ భోగరాజు, కళాసేవక్ పురస్కారగ్రహీత వడ్లకొండ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ గాయనీ ఆమని స్వరసారధ్యంలో గాయనీ గాయకులు పి.సుభాష్, బి.శ్రీనివాస్, రాజన్ పల్లుల, వెంకటేశ్వరరావు, అరుణరామ్, శ్రీమయి అద్భుతంగా గానం చేయగా కీబోర్డుపై సూర్యతేజ, తబలపై విద్యాసాగర్, రిథమ్ ప్యాడ్స్‌పై శివరామిరెడ్డి వాద్యసహకారాన్ని అందించారు.

## శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం నవరాత్రి వేడుకలు

**చిక్కడపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో సెప్టెంబరు 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు అంగరంగ వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. ప్రతి రోజు ఉదయం సుప్రభాతము, బిందెతీర్థం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి మూలమంత్ర హవనం, సాయంత్రం లక్ష్మీగణపతి మహిళా భక్త సమానం, ఆధ్వర్యంలో లలిత–విష్ణు సహ స్రనామ కార్యక్రమాలుంటాయన్నారు. 6న కుడుముల తద్ది సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవా చనము, 7న వినాయక చవితి సందర్భంగా స్వామివారికి నవరాత్రి దీక్ష, అభిషేకం, సర్వాభరణములతో అలంకరణలుంటాయన్నారు. సాయంత్రం శమంతకోపాఖ్యానం పురాణం బ్రహ్మశ్రీ కాసల రాధాకృష్ణచే ప్రవచనాలుంటాయన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి సంజయ్ కల్చరల్ ఎక్సలెంట్ : పద్మశ్రీ డా. శోభారాజు



కల్చరల్ ఎక్సలెన్సీ అవార్డుతో సంజయ్‌కిషోర్‌ను సత్కరిస్తున్న శోభారాజు, లక్ష్మీపార్వతి, భవాని, తనికెళ్ళ, హరికృష్ణ, రేలంగి

**రవీంద్రభారతి, ఆగస్టు 28 ప్రభాతవార్త :** యుక్తవయస్సు నుండి సంజయ్ కిషోర్ కళారంగంలో సినీ, కళలు, కళాకారులకు చేస్తున్న నిరంతర విశిష్టసేవలకు తన జీవితాన్ని అంకితం చేయడం అనితరసాధ్యమన్న అన్నమాచార్య భావనావాహిని వ్యవస్థాపకురాలు పద్మశ్రీ డా. శోభారాజు అలాంటి కల్చరల్ ఎక్సలెంట్‌ను అభినందన కల్చరల్ ఎక్సలెన్సీ అవార్డ్ 2024తో సత్కరించడం ఎంతో సబబుగా ఉందని సంస్థ అధ్యక్షురాలు అభినందన ఇ.భవానిని ప్రశంసించారు. ముఖ్యంగా తెలుగు సినీరంగానికి సంబంధించిన సమాచారం, ఫోటోలు సేకరించడం, రికార్డు, డాక్యుమెంటేషన్, పుస్తకరూపం తేవడంలో సంజయ్ తనకుతానే సాటని, సేకరణలో కలెక్షన్‌కింగ్ అని అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో అభినందన సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డా. ఇ.భవాని నిర్వహణలో ప్రముఖ రచయిత్రి నందమూరి లక్ష్మీపార్వతి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పద్మశ్రీ డా. శోభారాజు విశిష్ట అతిథులు డా. మామిడిహరికృష్ణ, తనికెళ్ళభరణి, రేలంగి నరసింహారావు, సంస్థ సంయుక్త కార్యదర్శి డా. జి.శోభాపేరిందేవి తదితరులతో కలిసి బహుముఖ ప్రజ్ఞాశీలి. సంగమం ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్ కిషోర్‌ను ఘనంగా సత్కరించి తెలుగు సంస్కృతి, రంగస్థల, సినీ, నృత్య సాహిత్య సాంస్కృతిక కళారంగాలకు అందించిన సేవలకు గుర్తింపుగా అభినందన కల్చరల్ ఎక్సలెన్సీ అవార్డు 2024ను బహూకరించి శుభాభినందనలు తెలిపారు. అనంతర అతిథులు కళారంగానికి సంజయ్ కిషోర్ చేసిన, చేస్తున్న సేవలను గుర్తుచేసి కొనియాడారు.

## బండ్లగూడ కార్పొరేషన్‌లో బిఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా నిలుపుతా

### - బిఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోల్ల నాగరాజు



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నుంచి నియామక పత్రంను అందుకుంటున్న రావులకోల్ల నాగరాజు.

**నార్సింగి, ఆగస్టు 28 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు రావులకోల్ల నాగరాజు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఇచ్చిన నియామక పత్రంను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా నాగరాజు అందుకున్నాడు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం ఏ ఆదేశం ఇచ్చినా బండ్లగూడ కార్పొరేషన్‌లో విజయవంతం చేస్తామని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను ఇచ్చిన సబితారెడ్డి, కార్తిక్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. బండ్లగూడలో కొంత మంది నాయకులు పార్టీ మారారని, కార్యకర్తలు అలాగే ఉన్నారని, వారిలో నుంచి కొత్త నాయకులను తయారు చేసుకుంటామన్నారు. గతంలో కంటే పటిష్టంగా బిఆర్ఎస్‌ను తయారు చేస్తామని, వచ్చే అన్ని ఎన్నికల్లో తమ సత్తాను చాటుకుంటామని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చిన గుర్తింపుతోనే కార్పొరేటర్ పదవులు అనుభవిస్తున్నామని, కారు గుర్తుపై ప్రజలు ఓట్లేస్తేనే ప్రజా ప్రతినిధులుగా చెలామణి అవుతున్నామని తెలిపారు. మాకు గుర్తింపునిచ్చిన నాయకులు, పార్టీలోనే ఉంటూ పార్టీ కోసం రేయింబవళ్లూ కష్టపడుతామన్నారు. సబితారెడ్డి, కార్తిక్‌రెడ్డిలు అన్ని వేళలా అండగా నిలుస్తామని భరోసా కల్పించారని, ప్రతీ గ్రామంలో తిరిగి ఉత్సాహవంతులతో నూతన కమిటీలను వేసి, పార్టీని భూత్ స్థాయి నుంచి పటిష్టం చేసుకుంటూ వస్తామన్నారు. అలాగే కార్పొరేటర్ రవీందర్‌రెడ్డికి బండ్లగూడ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యలు ఇచ్చారు. అధ్యక్షుడితో కలిసి బిఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేస్తామని రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## స్థానిక సంస్థల్లో సగరులకు అన్నిపార్టీలు అధికసీట్లు కేటాయించాలి

### -సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సగరులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి సీట్లు కేటాయించాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వచ్చే నెల 4న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించబోయే తెలంగాణ సగరుల రాజకీయ చైతన్య సదస్సుకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో కొంత మేరకు సగరులకు కొన్ని జీవోల ద్వారా న్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయంగా అవకాశం కల్పించి సగరులను ప్రోత్సహించాలని కోరారు. ఆర్థికంగా వెనకబాటుకు గురైన తమకు నామినేటెడ్ పదవుల్లో సైతం అవకాశం కల్పించడం తోపాటు సగర ఫెడరేషన్‌గా మార్చి చైర్మన్‌తోపాటు డైరెక్టర్ పదవులను కల్పించాలని విన్నవించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్న సగరులను ఆయా రాజకీయ పార్టీలు గుర్తించి స్థానికంగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సగర ఆత్మగౌరవ భవన్ ట్రస్ట్ చైర్మన్ మారుతీసాగర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డిలో చేసిన బిసి డిక్లరేషన్‌ను అనుసరించి బిసిలకు 42శాతం రిపజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కల్పించాలని కోరారు. తద్వారా ఇట్లాంటి చిన్నకులాలకు రాజకీయంగా అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం మాట్లాడుతూ సగర చైతన్య సదస్సులో తెలంగాణ రాష్ట్రంలోని 33జిల్లాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్న సగరులందరూ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో సగర సంఘం ముఖ్యసలహాదారులు ఆర్.బి ఆంజనేయులు, కెపి రాములు, చిలుక సత్యం, మర్క సురేష్, రవి, అస్కాని వెంకటస్వామి, సూర జయమ్మ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## బస్టాప్ ఏర్పాటు చేయాలని వినతి



**అత్తాపూర్ ఆగస్టు28, ప్రభాతవార్త :** శివరాంపల్లి పివి ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 274 వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని శివరాంపల్లి ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ ఆర్‌టిసి డిపో మేనేజర్ బద్రీనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. శివరాంపల్లి పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ పిల్లర్ నెంబర్ 274 బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు రోడ్డు మీద్ద నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదే ప్రాంతంలో యూ టర్న్ కూడా ఉండటంతో పాటు వేగంగా వచ్చే వాహనాలతో ఎప్పడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించడం జరిగిందని వివరించారు. నిత్యం విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగస్తులు ఇతర ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు వర్షాలకు తడుస్తూ, ఎండలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ బస్సు షెల్టర్ ఏర్పాటు జిహెచ్ఎంసి పరిధిలో ఉంటుందన్నారు. మేము మీరిచ్చిన వినతిపత్రాన్ని ఆసరాగా చేసుకుని జిహెచ్ఎంసి అధికారులకు సైతం బస్సు సెంటర్ ఏర్పాటుకు లేక రాస్తామని తెలిపారు. అందుకోసం జిహెచ్ఎంసి అధికారులకు వినతిపత్రాన్ని ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, శ్రీధర్, సాంస్కృతిక కార్యదర్శి సిద్ధం శ్రీనివాస్, సభ్యులు భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### -ఎసిపి శ్రీనివాస్, సిఐ వెంకట్రామ్ రెడ్డి



**అత్తాపూర్ ఆగస్టు28, ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలను కమిటీ నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎసిపి శ్రీనివాస్, సిఐ వెంకట్రామ్ రెడ్డి సూచించారు. బుధవారం అత్తాపూర్ పరిధిలోని లక్కీ పాలేస్ ఫంక్షన్ హాల్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎసిపి శ్రీనివాస్, సిఐ వెంకట్రామ్ రెడ్డిలు హాజరై గణేష్ ఉత్సవాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తప్పకుండా పోలీసుల జిహెచ్ఎంసి, ఎలక్ట్రిసిటి వారి అనుమతితో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. ఎవరైనా అవంచానియ ఘటనలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా పోలీసు నిబంధనలు పాటిస్తూ నిర్ణిత సమయంలో వినాయక నిమజ్జనం చేసుకోవాలని అన్నారు. గణేష్ ఉత్సవాలకు అన్ని ఏర్పాటు పకడ్బదీంగా ఏర్పాటు చేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, గణేష్ మండపాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రతి ఒక్క పథకాన్ని అర్హులైన ప్రతి పేదవాడు తీసుకునే విధంగా చూడాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన 162మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీఈముబారక్ చెక్కులను ఖైరతాబాద్ రెవెన్యూ డిప్యూటి తహశీల్దార్ రాజేష్‌తో కలిసి అందజేశారు. ఈకార్యక్రమంలో మన్సూర్, ఎక్బాల్, అక్తార్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## చెత్తాచెదారంతో డ్రైనేజీ దుర్గదం



**అత్తాపూర్ ఆగస్టు28, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ నర్సబాయ్ కుంట డ్రైనేజిలో చెత్తాచెదారం పెరుకుపోయి దుర్గదం వెదజల్లుతుంది. బుధవారం స్థానిక నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డిలు డ్రైనేజీని పరిశీంచి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ....గతంలో నర్సబా య్ కుంటలో పార్కు ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారని కానీ ప్రస్తుతం అది డ్రైనేజీ ,చేత చెదారానికి నిలయంగా మారిందని వాపోయారు. వర్షం పడితే ఇండ్లలోకి డ్రైనేజీ నీరు చేరుతుందని సిబ్బంది మరమ్మత్తులు చేసిన పరిస్థితిలో మార్పు రావడం లేదని అన్నారు. భరించలేని దుర్వాసనతో ఈ ప్రాంతంలోని ప్రజలు నడవలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాత్రి సమయంలో విపరీతంగా దోమలు ఉండడంతో వ్యాధుల బారిన పడుతున్నారని నూతన పైపు లైన్ వేసి సమస్య పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు ,సంబంధించిన అధికారులు చొరవ చూపాలని కోరతున్నారు.

## వ్యాధుల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**అత్తాపూర్ ఆగస్టు28, ప్రభాతవార్త :** వ్యాధుల భారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డిసి రవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని డిసి రవి కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి సిజినల్ వ్యాధుల ఓపి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు నెలలో ఒక డెంగ్యూ కేసును గుర్తించినట్లు డిసి వివరించారు. అనంతరం డిసి మాట్లాడుతూ..ప్రజలు వ్యాధుల భారినపడకుండా యాంటి లార్వా ,ఫాగింగ్ ఆపరేషన్లు నిర్వహించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా వ్యాధుల భారిన పడకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## తెలుగు భాషా వైతాళికుడు గిడుగు రామ్మూర్తి పంతులు

### -విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

**చిక్కడపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** తెలుగు భాషా వైతాళికుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసంగీత నాట్యవేది కలో ఎందరోమహానుభావులు మధుస్మృతులు కార్యక్ర మంలో భాగంగా తెలంఆణ వ్యావహారిక భాషోద్యమ సారధి గిడుగు వెంకట రామమూర్తి పంతులు యాదిలో కార్యక్రమం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాష లోకి తీసుకువచ్చి నిత్యవ్యవహారంలోని భాషల ఉన్న అందాన్ని, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు గిడుగువారు అని అన్నారు.


రైతు కుటుంబ వివరాలను తెలుసుకుంటున్న ఏడిఏ బాబునాయక్

## రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించిన అధికారులు

**గజ్వేల్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ కాని రైతు కుటుంబాల వివరాలను సేకరిస్తున్నట్లు గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ డివిజన్ పరిధిలోని కొండపాక, కుకునూర్‌పల్లి, రాయపోల్, గజ్వేల్ మండలాల్లో సంబంధిత ఏఓలతో కలిసి రైతుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. అర్హతలను బట్టి ప్రభుత్వం నుండి రుణమాఫీ డబ్బులు సంబంధిత రైతు అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో రుణమాఫీ, కుటుంబ నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. రైతు కుటుంబాల ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. గ్రామాల్లో ముందస్తు సమాచారం ఇచ్చి అట్టి గ్రామాల్లో రైతు కుటుంబాల వివరాలను సేకరించడం జరుగుతుందని, రైతులు వ్యవసాయాధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పలు మండలాల ఏఓలు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాని రైతు కుటుంబాల సర్వే : ఎవో


రైతుల నుండి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

**మర్కుక్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** రూ.2 లక్షల రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, రేషన్ కార్డు లేని రైతులకు కూడా కుటుంబ సర్వే నిర్వహించి అర్హులైనరైతులను గుర్తించి నిర్ధారించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గంగాపూర్, ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల్లో రేషన్‌కార్డు లేని అర్హులైన రైతు కుటుంబాలను సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబసభ్యుల ఆధార్ వివరాలను రైతు భరోసా యాప్‌లో పొందుపర్చడం జరుగుతుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందని పేర్కొన్నారు. రేషన్‌కార్డులేని రైతుల ఇంటి వద్దకు మేము వస్తామని, పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు రజనికాంత్, విష్ణువర్ధన్, భానుశ్రీ, రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న సదన్ మహారాజ్

**హుస్నాబాద్, ఆగస్టు 28,ప్రభాతవార్త :** సీజనల్ వ్యాదుల పట్ల ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయాలని ధర్మస్వరాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్ డిమాండ్ చేశారు.బుదవారం రోజున మండలంలోని మీర్జాపూర్‌లో గల ప్రయిమరీ హెల్త్ సెంటర్‌ను మండల కమిటి ముఖ్య నాయకులతో కలసి సందర్శించారు.అక్కడ పని చేస్తున్న సిబ్బందితో పాటు చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు సీజనల్ వ్యాదుట పట్ల అవగాహన కల్పించడంతో పాటు నిర్మాణంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు.అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఎల్లన్న,ముఖ్య నాయకులు శేఖర్,శ్రీనివాస్,శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తారు

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి


మాట్లాడుతున్న నరసింహారెడ్డి

**జహీరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని మూడు విడుతలుగా నిర్వహించి 2 లక్షల వరకు రుణాలు ఉన్న వారికి మాఫీ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి నర్సింహారెడ్డి మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదని, అలాంటి వారి వివరలను వ్యవసాయ అధికారులు రైతుల ఇండ్ల కాడికి చేరుకుని వివరాలు సేకరిస్తారన్నారు.అర్హులైన రైతులదరికి రుణమాఫీ కావడం తథ్యమన్నారు. బిఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించడం సరికాదని హెచ్చరించారు. గత 10 సంవత్సరాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు కూడా రుణమాఫీ చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్బర్ హుస్సేన్, కే నర్సింలు, కే భీమయ్య, కే సుభాష్‌రెడ్డి, పి నాగిశెట్టి, మల్లారెడ్డి, ఇమామ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ యాప్‌లో నమోదు చేయడానికి గ్రామాల్లో సర్వే

**నర్సాపూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** రుణమాఫీ 2024 సంవత్సరానికి సంబందించి కుటుంబ నిర్ధారణ చేయవల్సిఉన్న రైతుల వివరాలు రుణమాఫీ ఆప్‌లో నమోదు చేయడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సంధ్యరాణి తెలిపారు. బుధవారం రుస్తుంపేట, చిప్పల్‌తుర్తి, జక్కపల్లి గ్రామాల్లో రైతుల కుటంబ నిర్ధారణ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఎ సంధ్యరాణి మాట్లాడుతూ రుణమాఫీకి సంబంధించిన రైతుల కుటంబ వివరాల కోసం సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు రుస్తుంపేట, చిప్పల్‌తుర్తి,జక్కపల్లి గ్రామాల్లో సర్వేను నిర్వహించి రైతుల కుటుంబ నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. రైతులు షెడ్యుల్ ప్రకారం గ్రామాల్లో అందుబాటులోఉండి వ్యవసాయ అధికారులకు వివరాలు అందించి నమోదు చేసుకోవడంలో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడిఎ సంధ్యరాణితో పాటు మండల వ్యవసాయాధికారిణి దీపిక,వ్యవసాయ విస్తీర్ణఅధికారులు చంద్రవేణి,తేజస్విని తదితరులు పాల్గొన్నారు.


సర్వే చేస్తున్న ఏడిఎ సంధ్యరాణి ఇతర అధికారులు తదితరులు


వివాహానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## పేదింటి వివాహానికి ఆర్థికసాయం అందజేత

**కడ్తాల్,ఆగస్టు 28 ప్రభాతవార్త :** పేదింటి వివాహానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు కొండంత భరోసాను ఇస్తుంది. ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్లి చేయాలంటే గగనం అవుతున్న తల్లిదండ్రులకు తానున్నానని ధైర్యాన్ని కల్పిస్తుంది. వెయ్యి అబద్ధాలాడైనా ఆడపిల్ల పెళ్లి చేయాలంటారు పెద్దలు ఇదే సామెతను అక్షరాల నిజం చేస్తుంది రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు, పేదోడింట్ల ఆడపిల్ల వివాహం ఉందని తెలుసుకుంటే చాలూ అమ్మాయి వివాహానికి పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ. 21 వేలతో పాటు పట్టుచీర పంపిణీ చేస్తుంది. అందులో భాగంగా బుధవారం మండలంలోని గానుగుమర్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన కీ॥శే॥ జర్పుల శాంతి పాండు దంపతుల కూతురు జర్పుల గీత వావాహానికి రూ. 21 వేలతో పాటు ఒక పట్టు చీరను జర్పుల దశరథ్ నాయక్ శారద దంపతుల చేతుల మీదుగా ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో శంకర్, కిషన్, జగన్, వినోద్, చిత్ర, లక్ష్మి, సోనా, లాలి, అనిత, కవిత, తండా పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా సామాగ్రి కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

**కడ్తాల్,ఆగస్టు 28 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని రంగారెడ్డి జిల్లా ఎంపిటిసిల మాజీ కార్యదర్శి రావిచేడ్ మాజీ ఎంపిటిసి బొప్పిడి గోపాల్ అన్నారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా క్రీడల అభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని ఇచ్చిన మాట ప్రకారం బుధవారం కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్ జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి కొనుగోలు కోసం మాజీ ఎంపిటిసి బొప్పిడి గోపాల్ రూ. 11 వేలు ఉపాధ్యాయులకు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు స్వరూప, ఫిజికల్ డైరెక్టర్ సాబేర్, ఉపాధ్యాయులతో కలిసి గోపాల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రంగయ్య, నాయకులు బీరప్ప, శ్రీశైలం, కృష్ణయ్య, యాదయ్య, సాయికుమార్, ఉపాధ్యాయులు అశోక్, సతీష్, రమేష్, మంజుల, వినోద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పని విధానం వల్ల వచ్చే గుర్తింపు పదికాలాల పాటు ఉంటుంది

### మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్


మాట్లాడుతున్న యంఈఓ వెంకటయ్య గౌడ్

**పెద్దేముల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి తాను చేసే పని విధానం వల్ల వచ్చె గుర్తింపు పది కాలాల పాటు ఉంటుందని,అందుకు ప్రతిఒక్కరు అంకితభావంతో పనిచేయాలని మండల విద్యాదికారి వెంకటయ్య గౌడ్ అన్నారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులతో యంఈఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యంఈఓ వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూమద్యాహ్న భోజన విషయంలో నిర్లక్షం చేయకుండా ప్రతి హెచ్ఎం పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాలలను ఆదర్శంగా తీరిదిద్దడంలో అనుకున్న లక్ష్యాలను సాధించేవరకు కృషిచే యాలని అన్నారు. విధులు నిర్వహించడం వేరు మనస్పూర్తిగా పనిచేయ డం వేరని అన్నారు. నాణ్యమైన విద్యా భోధన,పరిశుభ్రత తదితర విషయాలలో ఉపాద్యాయులు తలచుకుంటే మార్పు తప్పనిసరి వస్తుందని అన్నారు. సీజనల్ వ్యాదుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకునేం దుకు చర్యలు చేపట్టాలని అన్నారు. 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను పరిశు భ్రంగా ఉంచే భాధ్యత జీపిలదేనని అన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంలు అక్క మహదేవి, నర్సింగ్ రావు, జోజప్ప, సునితా, మండల పిఆర్‌టియు అధ్యక్షులు రాజశేఖర్, ప్రధానకార్యదర్శి నవీన్ కు మార్, ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల నిర్మాణానికి విరాళం


దేవాలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న దాతలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఆగస్టు 28) :** ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయంలోని రామాలయం గర్భగుడిలో గ్రానైట్ ఏర్పాటు కోసం రిటైర్డ్ ఎస్ఐ పిల్లి బాలయ్య కుమారులు పిల్లి సురేష్ బాబు, పిల్లి జగన్, పిల్లి శివకుమార్, పిల్లి బాలకృష్ణ, పిల్లి బాలకిష్టయ్య 65,000 రూపాయలు విరాళంగా అందజేశారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి హాస్పిటల్ ఎండి ఐనాపురం మనోహర్ రెడ్డి పదివేలు విరాళంగా అందజేశారు.

## నేడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

**మేడ్చల్, ఆగస్టు 28. ప్రభాతవార్త ః** ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా నేడు మేడ్చల్‌లో మేడ్చల్ జోన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటలకు ఈ టోర్నమెంట్‌ను మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. మేడ్చల్ మండలంలోని ఆయా గ్రామాలు యువకులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

**మేడ్చల్, ఆగస్టు 28. ప్రభాతవార్త ః** లారీ ఢీకొని ఓబాలుడి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం రవీందర్ తన కొడుకు సత్విక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మేడ్చల్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారిపై వెళుతుండగా వెనుక నుంచి లారీ డీ కొట్టింది. ఈ ప్రమాదంలో కొడుకు సత్విక్ అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఆలయ కమిటి సభ్యులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

## అంబురామేశ్వర జాతరకు భారీ బందోబస్తు : డిఎస్‌పి

**పెద్దేముల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** అంబురామేశ్వర జాతరకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తాండూరు డిఎస్‌పి బాలక్రిష్ణరెడ్డి అన్నారు. బుదవారం పెద్దేముల్ మండలంలోని తట్టెపల్లి అంబురామేశ్వర జాతర ఏర్పాట్లను ఎస్ఐ గిరితో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సం దర్భంగా డిఎస్‌పి బాలక్రిష్ణరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 2న నిర్వహించే అంబురామన్న జాతరకు వచ్చె భక్తులకు ఏలాంటి అవాంచనీ యమైనసంఘ టనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జాతర మహోత్సవానికి ప్రతి ఒక్కరు సహకరించి శాంతియుతంగా జరుపు కోవాలని అన్నారు. జాతరకు వచ్చె భక్తులు ఆలయ కమిటి సభ్యులకు, పోలీ సులకు సహకరించాలని అన్నారు. అనంతరం ఆలయ కమిటిసభ్యులతో మాట్లాడి జాతరకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం


ప్రవచనాలు వింటున్న భక్తులు

**కడ్తాల్,ఆగస్టు 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శ్రీసాయి మం దిరంలో బుధవారం శ్రీ లలిత పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్ర మాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమ నిర్వాహకులు దేవాల యాన్ని పచ్చటి తోరణాలు, పూల పందిరులతో ఘనంగా శోభాయమా నంగా అలంకరించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా తొలిరోజు బుధవారం ఉదయం గోపూజ, గణపతిపూజ, పుణ్యాహావాచనం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అదేవి ధంగా ప్రముఖ అన్నమాచార్య సంకీర్తనాచార్యులు, రాష్ట్రపతి సాహిత్య పుర స్కార గ్రహీత డా. దీక్షితుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యం ప్రవచనాలు, సంకీర్తనలు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి. అనంతరం దీక్షితుల సుబ్రహ్మణ్యంను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మినర్సింహారెడ్డి గ్రామ స్తులతో కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏడువేలకు పైచిలుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొని, నంది అవార్డుతో పాటు 405 అవార్డులు పొందిన దీక్షితుల సుబ్రహ్మణ్యం కడ్తాల్ గ్రామానికి రావడం, అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని వారి ప్రవచనాలు మన సంప్రదాయానికి, సంస్కృతికి, ఆధ్యాత్మికతకు ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జ్ఞాన ప్రసూనాంబశర్మ, ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, గ్రామపెద్దలు మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, నారాయణ, రాఘవాచారి, శ్రీనివాస్, స్త్రీశక్తి లలితాంబిక భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**కేశంపేట ఆగస్టు 28, ప్రభాతవార్త** ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేముల నర్వగ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కేశంపేట మండల పరిదిలోని వేముల నర్వ గ్రామానికి చెందిన గంజాయి ప్రమోద్ (30) వృత్తిరీత్యా కూలీ గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవని ఆ కారణంగానే ఇంట్లో మంగళవారం రాత్రి ఉరివేసుకుని చనిపోయాడని మృతుడి దండ్రి గంజయి జంగయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాజ్‌కుమార్ తెలిపారు.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీలు

వికారాబాద్ రూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త విరాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట బూరుగుపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికలు) పాఠశాల , కళాశాలలో పిజిటి ఫిజికల్ సైన్స్ ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఫిజియోథెరఫీ జేఎల్ ఫిజికల్ సైన్స్ ఖాళీలు ఉన్నాయని టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జెసి ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల30వ తేదీ ఉదయం 9గంటలకు ఎస్‌జిఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ జెసి కొత్తగాడి వికారాబాద్‌లో నిర్వహించే డెమోలకు సంబంధిత రెస్యూమ్ సర్టిఫికెట్లలతో హాజరు కాగలరిన ఆయన తెలిపారు.

## గురునాథ్‌రెడ్డిని కలిసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ


గురునాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న రాష్ట్ర డీజీపీ

**కొడంగల్,ఆగష్టు 28ప్రభాతవార్త** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే,తెలంగాణ రాష్ట్రపోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మేన్ ఆర్.గురునాథ్‌రెడ్డిని రాష్ట్ర డీజీపీ జితేందర్‌రెడ్డి కలిశారు.బుధవారం హైద్రాబాద్‌లోని కార్యాలయంలో ఆయ నను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురునాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందించి మర్యాదపూర ్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం స్పందించాలి

### -ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు భీమరాజు

**కొడంగల్,ఆగష్టు 28ప్రభాతవార్త** తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు నుంచి విద్యార్డుల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని,పేద మద్య తరగతి విద్యార్డులు చదువుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారంటే వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్,స్కాలర్ షిప్ వస్తుందనే ఆశాభావంతో విద్యార్డులు చదవుకోవడానికి ముందుకు రావడం జరుగుతుందని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అద్యక్షు లు భీమరాజు అన్నారు.బుధవారం ఆయన కొడంగల్‌లో మాట్లాడుతు ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై గతీ ప్రభుత్వం చుతకన చేసి విద్యార్డులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వపోగా మంత్రులు,ఎమ్మెల్యేలు విద్యార్డులపై అనేక రకాల మాటలు అని విద్యార్డుల మనసు నోచ్చుకునే విధంగా మాట్లాడి ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టడం జరిగిందన్నారు.ప్రస్తుత ప్రభుత్వం విద్యారు ్దల ఇబ్బందులను గుర్తించి వెంటనే బకాయి ఉన్న ఫీజు రీయంబర్ స్మెంట్,స్కాలర్ షిప్‌లు చెల్లించి విద్యార్డులకు బాసటగా నిలువాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు భీమరాజు

## నేడు రంగంపేటలో 2కె రన్

**కొల్చారం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఆగస్టు 29వ తేదీ జాతీయ క్రీడల దినోత్సవం (ధ్యాన్ చంద్ జయంతి) పురస్కరించుకొని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత నేడు (గురువారం) 2కే రన్ నిర్వహించడం జరుగుతుందని పాఠశాల పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ 2కే రన్‌లో జిల్లాలోని అన్ని మండలాల క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ 2కే రన్‌లో వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షులు తునుకులపల్లి సంతోష్ కుమార్ సహకారంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ 2కే రన్‌లో విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.

## బోనాల వేడుకలకు విరాళం

**శివ్వంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** మండలంలోని పాంబండ గ్రామంలో గరిగేలమ్మ జాతర ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా బుధవారం 10 వేల రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ గుప్తా మాట్లాడుతూ గ్రామంలో జరిగే బోనాల ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. ఉత్సవాలకు విరాళం అందజేసిన నవీన్ గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి తలారి శివులు, వారాల గణేష్, ప్రభులింగంగౌడ్, ఇసుగారి అరుణ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**శివ్వంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం చండి గ్రామానికి చెందిన ఉప్పరి బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించినందున విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేష్ గుప్తా వారి కుటుంబాన్ని బుధవారం పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన శివన్నగారి గోపాల్ మరణించినందున వారి కుటుంబాన్ని పరామర్శించి మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేష్ గుప్తా 5 వేల రూపాయలు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి కుటుంబానికి తన వంతు సహాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఉమ అనిల్ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యంరెడ్డి, నాయకులు ప్రవీన్ గౌడ్, నవీన్ కుమార్, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, మల్లేశం పాల్గొన్నారు.

## రుణమాఫీపై కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే

**కొల్చారం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** రుణమాఫీలో భాగంగా కుటుంబ సభ్యుల నిర్ధారణ (రేషన్ కార్డు లేని రైతులు) కోసం మండల వ్యవసాయ అధికారి (ఏవో), వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో)లు గ్రామాలకు వస్తారని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.లిస్టులో పేర్లు ఉన్న రైతులు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వేచి ఉన్న రైతులు గ్రామంలో కుటుంబ సభ్యులతో వేచి ఉండాలన్నారు. ఏ గ్రామానికి ఏ రోజు అధికారులు వస్తారనేది వ్యవసాయ విస్తరణ అధికారి గ్రామానికి అధికారులు వచ్చే ఒక రోజు ముందుగానే తెలియజేస్తారని వివరించారు. దీనికోసం వ్యవసాయకార్యాలయానికి కానీ, సంబంధించిన రైతువేదికకు కానీ వెళ్లవలసిన అవసరం లేదన్నారు. దీనికోసం రైతులు పంట లోన్ ఉన్న రైతుల ఆధార్ కార్డు, కుటుంబ సభ్యులు ఆధార్ కార్డులు, అప్లికేషన్ ఫారం, కుటుంబ సభ్యులు గ్రామాల్లో ఉండాలని వివరించారు.

## వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

### -మర్కుక్ ఎస్ఐ దామోదర్

**మర్కుక్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** మండలంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి తీసుకోవాలనిఎస్ఐ దామోదర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద బాక్స్ టైప్ లౌడ్ స్పీకర్లు మాత్రమే వాడాలని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటలవరకు లౌడ్ స్పీకర్లు వినియోగించవద్దని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని, మండపాలను రోడ్డుకు అడ్డంగా వేయవద్దని, డిజెలకు అనుమతి లేదని తెలిపారు. మండపాలవద్ద సిసి కెమెరాలను, ఫైర్ సేఫ్టీలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి విద్యుత్ షాక్ తగలకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని మండపాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. శాంతియుత వాతావరణంలో గణేష్ పండుగను జరుపుకోవాలని కోరారు.

## పేద వధువు వివాహానికి బియ్యం అందజేత

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డుకు చెందిన నిరుపేద కుటుంబమైన పూదరి రామవ్వ కూతురు నవనీత వివాహానికి ఆ వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య సౌజన్యంతో లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు లక్ష్మి ఫౌండేషన్ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన పడిగె మల్లయ్య బుధవారం మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎంపిటిసి జ్యోతిస్వామి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనతోపాటు బిసిసెల్ నాయకుడు పురం ఆంజనేయులు, ప్రభాకర్, అనిల్, కిష్టయ్య, సత్తయ్య, కృష్ణస్వామి ఉన్నారు.

## ప్రభుత్వ భూములు కాపాడాలి: యూసుఫొద్దీన్

**గజ్వేల్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని ప్రజ్ఞాపూర్ గ్రామ శివారులో గల జగదేవ్‌పూర్ రోడ్డులో ఉన్న 131 సర్వే నెంబర్‌లోని మూడు ఎకరాల మూడు గుంటల ప్రభుత్వ భూమిని కొందరు రియల్టర్లు అక్రమంగా కబ్జాచేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన ఎండి.యూసుఫొద్దీన్ ఆరోపించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడాలని ఈనెల 8వ తేదీన తహసీల్దార్, ఆర్డీఓలకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రజ్ఞాపూర్‌లోని ప్రభుత్వ భూములు, కుంట శిఖం భూములను కొంత మంది రియల్టర్లు సర్వే నెంబర్లు మార్చి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదని తెలిపారు. మూడు ఎకరాల మూడు గుంటల ప్రభుత్వ భూమిలో కొంత స్మశాన వాటిక, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయగా మిగిలిన భూమిని కబ్జా చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి భూములను కాపాడాలని కోరారు.

## శివ మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని రామాలయం ప్రాంగణంలోగల శ్రీ శివమార్కండేయ దేవాలయ 26వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పుష్పార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించగా పట్టణంలోని పద్మశాలిలు అందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మార్కండేయ ఆలయ అధ్యక్షుడు దేవులపల్లి రాజారామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గజ్వేల్ మాజీఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌లు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దొంతుల ప్రసాద్, గాడిపల్లి శ్రీనివాస్, తలకొక్కుల లక్ష్మణ్, తలకొక్కుల దుర్గాప్రసాద్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి కులస్తులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థి దశ చాలా కీలకం : సిఐ

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** విద్యార్థి దశ చాలా కీలకమని, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని గజ్వేల్ సిఐ సైదా తెలిపారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని జిఎంఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణ, షీటీమ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సైదా మాట్లాడుతూ సమయాన్ని వృధా చేయకుండా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని విద్యార్థులు గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలన్నారు. మనిషి మనుగడకు చదువు, సంస్కారం, క్రమశిక్షణ, పెద్దలను, గురువులను గౌరవించడం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, గజ్వేల్ షీటీమ్ బృందం శ్రీరాములు, ఏఎస్ఐ మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 28,(ప్రభాతవార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అమలు పరుస్తున్న పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని జిల్లెడు గ్రామంలో జాతీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార ఏర్పాటు చేసిన డ్రాగెన్ తోటను ఆయన పరిశీలిం చారు. గ్రామానికి చెందిన బాలరాజు ఉపాధిహామీ పథకం ద్వార డ్రాగన్ తోట పెంచుకోవడం ఎంతో లాభదాయకమని అన్నారు. అర్హులై న రైతులు తమ పొలాల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలని ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ దేవోజి, పంచాయి తీ కార్యదర్శి సమత తదితరులు ఉన్నారు.



పుల్‌కల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పోటీపడుతున్న విద్యార్థులు

## అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ క్రీడలు

### -పాల్గొన్న అండర్ 14, 17 బాలికలు

**పుల్‌కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. 2 రోజులుపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగనున్న క్రీడల్లో అండర్ 14, 17 బాలురు, బాలికలు పోటీల్లో పాల్గొంటున్నారు. సింగూరు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంఈఓ వి శంకర్ జ్యోతి ప్రజ్వలనచేసి క్రీడలను ప్రారంభించారు. మండల కేంద్రమైన చౌటకూరులో స్థానిక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి క్రీడలను ప్రారంభించారు. మొదటి రోజైన బుధవారం అండర్ 14, 17 బాలికలు కబడ్డీ వాలీబాల్, ఖోఖో క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. చౌటకూరులో జరిగిన క్రీడల్లో సుల్తాన్‌పూర్, శివంపేట, చౌటకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికలు హాజరయ్యారు. కాగా పుల్కల్ మండలంలో జరిగిన క్రీడలకు పుల్కల్ కేజీబీవీ బస్వాపూర్ ఆదర్శ పాఠశాల, సింగూరు, పెద్దారెడ్డిపేట, ముదిమాణిక్యం, గొంగ్లూరు మిన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఆర్‌టీయు మండల అధ్యక్షులు సీ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, పీఈటీలు , పీడీలు పాల్గొన్నారు.

## బస్తీదర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్



కాకతీయ నగర్‌లో బస్తీదర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రామచంద్రానగర్ డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ జీహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఈఈ సురేష్, ఏఈ ప్రభు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో కలిసి కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని ఖాళీ స్థలంలో థీమ్ పార్క్ నిర్మించేందుకు కాలనీవాసులు, అధికారులతో చర్చించి పార్క్ నిర్మాణానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. కాలనీలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, గార్డెన్, ప్లే ఆపరేటర్, ఫౌంటేన్, ప్లేఏరియా, నూతన ఆధునిక కాంపౌండ్‌వాల్, మోడల్ కామన్ తో కూడిన థీమ్‌పార్క్ నిర్మించడానికి అవసరమైన బడ్జెట్‌కు ఉన్నతాధికారులతో చర్చించి ఎమ్మెల్యే, మంత్రుల సహకారంతో నిధులు మంజూరు చేయిస్తానని కార్పొరేటర్ భరోసా కల్పించారు. కాలనీలోని టీచర్స్ అపార్ట్‌మెంట్ ముందు, రోడ్డు నంబర్ 5 నుంచి సర్దార్ వల్లభాయ్ విగ్రహం వరకు ఉన్న డ్రైనేజి సమస్య గురించి చర్చించి నిధుల మంజూరుకు జలమండలి ఎండి గారికి వినతిపత్రం ఇచ్చామని, త్వరలో నిధులు మంజూరు అవుతాయని, పనులను ప్రారంభిస్తామని కార్పొరేటర్ వివరించారు. కాకతీయనగర్ కాలనీ మెయిన్ రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డు కొరకు అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బాబు, వెంకట్‌రావు, శేషాద్రి, బసవరాజ్, కృష్ణరెడ్డి, మునిందర్, పాండురంగం, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాని రైతులు దరఖాస్తులు చేసుకోవాలి

**నారాయణఖేడ్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఇటీవల రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా రైతులకు రేషన్‌కార్డులు లేకపోవడంతో రుణమాఫీ కాని రైతులు కుటుంబసభ్యులతో కలిగిన ఆధార్‌కార్డు, ధృవీకరణ పత్రాలు మీ గ్రామాలకు సంబంధించిన(ఏఈఓ) వ్యవసాయ అధికారులకు అందజేయాలని మండల వ్యవసాయాధికారి శంకర్ తెలిపారు. బుధవారం నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో రైతులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. రైతుభరోసా యాప్ లో కుటుంబ సభ్యుల గ్రూపింగ్ వివరాలు యాప్‌లో నమోదు చేశారు. రైతులు ఎలాంటి ఆందోళనలు చేద్దవద్దని అర్హులైన ప్రతి ఒక్కరు తమ తమ దరఖాస్తులను అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సతీష్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కంగ్టి మండల వ్యవసాయాధికారిగా వెంకటేశం

**కంగ్టి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** కంగ్టి మండలానికి ఇన్‌ఛార్జి ఎంఏఓగా మండల నోడల్‌అధికారి ఎ.వెంకటేశం నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటేశం మాట్లాడుతూ రైతులకు ప్రజలకు అందుబాటులో ఉంటానని, అలాగే రుణమాఫీలో సందేహం ఉన్న తమకు సమాచారం అందించాలని కోరారు. రూ.2 లక్షల వరకు మాఫీలో భాగంగా రేషన్‌కార్డు లేనివారికి కుటుంబ నిర్ధారణకు వారి గ్రామాల్లోకి నోడల్ అధికారులు వస్తారని ఆయన తెలిపారు. బుధవారం 20 మంది రైతులు కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్చి వేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో రోడ్డుపై గల గుంతలను ఎస్ఐ రాజు సూచన మేరకు బుధవారం పోలీసు సిబ్బంది పూడ్చివేశారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానానికివస్తున్న భక్తులు, గ్రామస్తులు నర్సింగరావు గెస్ట్ హౌస్, ఎపిజివిబి బ్యాంకు ముందు రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ఇబ్బందులు పడుతుండడంతో ఎస్ఐ సూచన మేరకు పోలీసు సిబ్బంది మట్టిపోసి పూడ్చివేసి జెసిబితో చదును చేయించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**పుల్కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రైతులు సాగు చేస్తున్న వరి, ప్రత్తి పంటలను బుధవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తకే సరిత పరిశీలించారు. వరిలో చిరు సంచి కూనారం-12368 సన్న గింజ రకం గమనించాడం జరిగిందని శాస్త్రవేత్త సరిత పేర్కొన్నారు. ఈ రకం 125 నుంచి 130 రోజుల కాలపరిమిత కలిగి 26-30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వివరించారు. ప్రస్తుతం పంట పిలక దశలో ఉందని, దుబ్బుకి 18-20 పిలకలు గమనించి ఒక చదరపు మీటారుకి 28 దుబ్బలు కలిగి ఉందన, అదేవిధంగా కాండం తొలిచే పురుగును పంటకు సోకినట్లు గుర్తించామన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరాన్‌ట్రనిలిప్రోవ్ 0.3 మిమి లీటరు నీటికి కలికి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. అందోల్ గ్రామం లో రైతు చంద్రశేఖర్‌రెడ్డి పండిస్తున్న ప్రత్తి పంటను పరిశీలించి రైతుకు తగు సూచనలు, సలహాలు అందచేశారు. ప్రత్తి పంట ప్రస్తుతం కాయ, గూడు కట్టే దశలో ఉందని, మెపిక్వాట్ క్లోరైడ్ 1.2మిల్లీ లీటర్లు 1 లీటరు నీటిలో కలిసి పంటకు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇస్తే బిజెపికి ఏం సంబంధం?

### మెదక్ ఎంపి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
లిక్కర్ స్కాంలో కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇస్తే బయటకు వచ్చిందే తప్ప బిజెపికి ఏం సంబంధమని.. కాంగ్రెస్ నాయకులు కవిత బెయిల్‌కు బిజెపికి సంబంధం ఉందని వ్యాఖ్యాలు చేయడం సరికాదని మెదక్ ఎంపి రఘుందన్‌రావు అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ నాయకుల రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కవిత అరెస్టు, బెయిల్‌కు బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు బిజెపిపై బురద జల్లే పని పెట్టుకున్నారని మండిపడ్డారు. అబద్దాల పునాదులమీద కాంగ్రెస్ పార్టీ ఎదుగుతుందన్నారు. ఢిల్లీ డిప్యూటీ సిఎం మనిష్‌సిసోడియాకు బెయిల్ కోర్టు ఇచ్చిందా బిజెపి ఇచ్చిందా చెప్పాలని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. మనిష్ సిసోడియాకు, జర్ఖాండ్ ముఖ్యమంత్రికి బెయిల్ వచ్చినప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడలేదన్నారు. వారికి బిజెపి బెయిల్ ఇచ్చిందా అని ప్రశ్నించారు. మనిష్ సిసోడియాకు, జర్ఖాండ్ సిఎంకు బెయిల్ వేస్తే బిజెపికి సంబంధంలేదు కానీ కవితకు బెయిల్ వస్తే బిజెపికి సంబంధం ఉందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. బెయిల్ అనేది కోర్టులకు సంబంధించిన విషయమని పార్టీలకు సంబంధించిన విషయం కాదన్నారు. బిజెపి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒంటరిగా ఎదగాలని ప్రయత్నిస్తుందే తప్ప బిజెపి ఎవరిని విలీనం చేసుకోవడానికి ఎంపిగా తనకు తెలిసినంత వరకు సిద్దంగా లేదన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోడి గుడ్డుమీద ఈకలు పీకేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కవిత బెయిల్‌పై సుప్రీంకోర్టులో అభిషేక్ మన్వీ, కపిల్ సిబల్‌తో పాటు మరొకరు వాదనాలు చేశారని వీరంతా ఏ పార్టీకి చెందిన వారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీకి కోర్టులు, ప్రజాస్వామ్యం, పార్లమెంటుపై నమ్మకం లేదన్నారు. కాంగ్రెస్‌నాయకులు మోకాలకు బోడగుండకు లింకు పెట్టే వ్యాఖ్యాలు చేయడం మానుకోవాలన్నారు. ముస్లిం మహిళలకు మనోవర్తి ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇస్తే అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ వ్యతిరేకంగా ఆర్డినేన్స్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, విభీషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బహుజన సమాజ్‌పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వినయ్‌కుమార్

## కబ్జా కోరల్లో మేళ్ల చెరువు..బడాబాబులపై చర్యలకు డిమాండ్

**రామచంద్రాపురం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మేళ్ల చెరువును బడా బాబులు కబ్జా చేశారని బహుజన సమాజ్ పార్టీ పటాన్‌చెరు అసెంబ్లి ఇంచార్జి సుంకు వినయ్‌కుమార్ తెలిపారు. మేళ్ల చెరువను మట్టి పోసి కబ్జా చేసినట్లు ఇరిగేషన్ రికార్డులు ధృవీకరిస్తున్నాయని గుర్తు చేశారు. మేళ్ల చెరువులోని ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లో సర్వే నంబర్ 385లో కొంత భాగం ఏలీయన్స్ స్పేస్ స్టేషన్ వారు సర్వే నంబర్423, 386లో కొంత భాగం నివీ ప్రాపర్టీస్ డెవలపర్స్ వారు సర్వే నెంబర్ 422లో కొంత భాగం సంకల్ప్ హోమ్స్ వారు కబ్జా చేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. కబ్జాల గురించి హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్లు వినయ్‌కుమార్ తెలిపారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని కమీషనర్ రంగనాథ్ హామి చేశారని, వారం రోజుల్లో తెల్లాపూర్‌ను సందర్శించి కబ్జాలను పరిశీలిస్తామని కమీషనర్ పేర్కొనట్లు వినయ్‌కుమార్ వివరించారు.

## ఎఎన్ఎం కమలకు సూపర్‌వైజర్‌గా పదోన్నతి

**కంగ్టి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** కంగ్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న కమలను సూపర్‌వైజర్‌గా పదోన్నతి వచ్చిందని పిహెచ్ డాక్టరు నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ పదోన్నతి రావడం నాపై మరింత బాధ్యతలు పెరిగిందని ఎళ్ల వేళల ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆమెకు పదోన్నతి పొందడంతో సిబ్బంది గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

## సిర్గాపూర్‌లో ప్రారంభమైన స్కూల్ గేమ్స్

**సిర్గాపూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగారం శ్రీనివాస్ ప్రారంభించారు. మండల పరిధిలోని వాసర్, కడ్పల్ తదితర గ్రామాల్లోని పాఠశాలల నుంచి బాలబాలికలు క్రీడా పోటీలను తిలకించేందుకు, బాలకలు పోటీల్లో తలపడేందుకు తరలివచ్చారు. బుధవారం నిర్వహించిన కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఆసక్తిగా పాల్గొని పోటీల్లో తలపడ్డారు. కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయులు రమేష్, సంతోష్, దేవ్ సింగ్, సుమలత, రాజు, మీనా, పర్యవేక్షకులు రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కౌన్సిలర్

**నర్సాపూర్ ఆగస్టు 28. ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డు శ్రీరాంనగర్ కాలనీలో కొనసాగుతున్న రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మురికికాలువల పూడికతీత, పరిసరాల పరిశుభ్రత వంటి పనులను బుధవారం కౌన్సిలర్ వనముల బుచ్చేష్‌యాదవ్ పరిశీలించారు. కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ సొంత నిధులతో చేయిస్తుండగా మున్సిపల్ అధ్వర్యంలో చేపడుతున్న ఈ వార్డులోని నాగభూషణం కాలనీలో మట్టి రోడ్డులో గ్రావెల్ వేయంచడం, ఈ కాలనీలో పారిశుధ్య పనుల్లో భాగంగా మురికి కాలువల లోని చెత్తాచెదారాల పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. ఈమేరకు ఈ పనులను కౌన్సిలర్ వనముల బుచ్చేష్‌యాదవ్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్య పనులు, మురికి కాలువలో పూడిక తీత, పరిసరాల పరిశుభ్రతవంటి పనులతో పాటు రోడ్డులో మట్టి పనులు తదితర పనులు మున్సిఫల్ ద్వార చేపట్టినట్లు తెలిపారు. అంతేగాక ఈ కాలనీలో కొత్తగా వేస్తున్న రోడ్డు, నాలాల పై కల్వర్టు పనులు తన స్వంత నిధులతో చేయిస్తున్నట్లు తెలిపారు. మిగతా మురికి కాలువ పూడిక తీత, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మట్టి రోడ్డు వేయడం వంటి తదితర పనులు మున్సిఫల్ అధ్వర్యంలో చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సదరు కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఈ మేరకు ఈ పనులన్ని త్వరలోనే పూర్తి చేస్తామని కౌన్సలర్ బుచ్చేష్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ దుర్గయ్య, తో పాటు కాలనీ వాసులు భాస్కర్, నాగయ్య, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ తదితరులు



గజగట్లపల్లిలో వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

## వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి ఊరేగింపు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 28,ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లిలో వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని భుదవారం భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి జరిగిన తరువాతి రెండవరోజు వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని గ్రామ పురవిధుల్లో ఊరేగించడం తరాలుగా వస్తున్న ఆచారమని పంతులు భీశ్మాచారి తెలిపారు. వెంకటేశ్వరస్వామిని ఊరేగింపుగా తిసుకోచ్చినప్పుడు భక్తులు పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు.

## పంట రుణమాఫీ వివరాల నమోదు



చెన్నాయిపల్లిలో రైతుల నుండి వివరాలను సేకరిస్తున్న లక్ష్మీ ప్రవీణ్

**చిన్నశంకరంపేట, ఆగస్టు 28,ప్రభాతవార్త:** మండల పరిధి చెన్నాయిపల్లి లో ప్రభుత్వం అందిస్తున్న రూ.2లక్షల పంట రుణమాఫీ వివరాలను బుధవారం మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్, ఏవో శ్రీనివాస్‌లు నమోదు చేశారు. ఒక కుటుంబంలో ఎంత మందికి రుణమాఫీ అయింది, ఇంకా ఎంత మందికి కావాల్సి ఉందో వివరాలను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పంట రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ డబ్బులు జమ అవుతాయని ఆయన తెలిపారు.

## నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గెమ్స్ ఫెడరెషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటలో 14 సంవత్సరాలలోపు ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వివిధ ఆటలలో పాల్గొంటారని, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను జిల్లాస్థాయి ఆటలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్ మండల అధికారులు పాల్గోననున్నట్లు ఆయన వివరించారు.

## స్త్రీ నిధి ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ

**నర్సాపూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మహిళా గ్రూపు సంఘంలో సభ్యురాలుగా ఉండి చనిపోయిన బాధితులకు స్త్రీ నిధి ద్వార మంజూరైన చెక్కులను బుదవారం నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈమేరకు నర్సాపూర్ పట్టణం లోని రామ్ రహీం అనే గ్రూపు సభ్యురాలు మౌనిక చనిపోవడం వల్ల ఆమె కు స్త్రీ నిధి ద్వార ఇన్స్‌రెన్స్ కంపెనీ నుండి 2 లక్షల మంజూరు కావడం జరగింది. అదేవిదంగా నంది మహిళా గ్రూపు సంఘంలోని సభ్యురాలు బాగ్యలక్ష్మి చనిపోయినందున ఆమెకు 30 వేల ఇన్స్‌రెన్స్ డబ్బులు మంజూరు కావడం జరిగింది. ఈమేరకు ఇద్దరు బాధితులకు మంజూరైన మౌనిక కు 2 లక్షల రూపాయిల చెక్కును, అదేవిదంగా బాఘ్యలక్ష్మి కి మంజూరైన 30 వేల రూపాయిల చెక్కును మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చేతుల మీదుగా సంఘ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ మహిళా సంఘం గ్రూపులో ఉన్న సభ్యురాలు చనిపోవడం వల్ల వారికి స్త్రీ నిధి ద్వార ఇన్స్‌రెన్స్ సౌకర్యం ఉన్నందున ఆ ఇన్స్‌రెన్స్ కంపెనీ నుండి ఈ డబ్బులు మంజూరైనట్లు తెలిపారు. ఈమేరకు ఈ డబ్బుల చెక్కులను బాధిత కుటుంబాల సభ్యులకు అందజేసి సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎల్ఎఫ్ 1 అధ్యక్షురాలు అనిత, ఆర్‌పి సోని, మహిళా గ్రూపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందచేస్తున్న ఏఈఓ, పీడిలు

**జహీరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**
మండలస్థాయి ఎస్‌జిఎఫ్‌ఐ టోర్నమెంట్ క్యాంప్ సెలక్షన్‌లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న 500 మంది బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను బుధవారం నిర్వహించారు. క్రీడాపోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేయడం జరిగిందని ఎంఈఓ బస్వరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్ బస్వరాజ్, ఆయా పాఠశాలల పిడి, పీఈటిలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మండల స్థాయిలో ప్రతిభ చాటిన పాఠశాలలు...**

మండల స్థాయిలో బుధవారం నిర్వహించిన క్రీడాపోటీల్లో తలపడి ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈఓ బస్వరాజ్ తెలిపారు. అండర్ 14 విభాగం బాలికల కబడ్డీలో డాక్టర్ ఆర్ఎల్ఆర్ పాఠశాల ప్రథమ స్థానంలో టిజిఆర్ఎస్ హోతి(కె) పాఠశాల ద్వితీయ స్థానంలో, అండర్ 14 బాలికల వాలీబాల్‌పోటీల్లో టిజిఆర్ఎస్ హోతి(కె) పాఠశాల ప్రథమ స్థానంలో, జహీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో, అండర్ 17 బాలికల ఖోఖో పోటీల్లో టిజిఆర్ఎస్ హోతి(కె) పాఠశాల ప్రథమ స్థానంలో, టిజిఎస్‌డబ్బుఆర్ఎస్ రంజోల్ పాఠశాల ద్వితీయస్థానంలో, అండర్ 17 బాలికల వాలీబాల్ పోటీల్లో టిజిఆర్ఎస్ హోతి(కె) పాఠశాల ప్రథమ స్థానంలో, టిఎస్‌డబ్లుఆర్ఎస్ రంజోల్ పాఠశాల ద్వితీయ స్థానంలో, అండర్ 17 బాలికల కబడ్డీ పోటీల్లో చిరాగ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో, టిజిఆర్ఎస్ హోతి(కె)పాఠశాల ద్వితీయ స్థానంలో, అండర్ 14 బాలికల ఖోఖో పోటీల్లో టిజిఆర్ఎస్ హోతి(కె) పాఠశాల ప్రథమ స్థానంలో, చిరాగ్‌పల్లి జిల్లా పరిషత్ ఉననత పాఠశాల ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు ఎంఈఓ బస్వరాజ్ వివరించారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## పార్టీ సభ్యత్వ నమోదులో ఇతర మండలాలకు ఆదర్శంగా నిలవాలి

**మిరుదొడ్డి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** బిజెపి(కేంద్ర పార్టీ) ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మెదక్ ఎంపి రఘునందన్‌రావు ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి సూచనలతో ప్రతి బూత్‌లో 200 సంఖ్యకు తగ్గకుండా సభ్యత్వం చేయించాలని నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా సభ్యత్వ కన్వీనర్ మల్లన్నగారి బిక్షపతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పార్టీ అధ్యక్షులు ఎలుముల దేవరాజు ఆధ్వర్యంలో సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం 6 వేల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కానుగంటి శ్రీనివాస్, సురేష్, సదానందరెడ్డి, భాను, స్వామి, రవి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, రాజు, నర్సింలు, నారాయణరెడ్డి, అశోక్, సంతోష్, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రేషన్ కార్డు లేని రైతు వివరాల సేకరణ

**బెజ్జంకి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 29 నుంచి మండల వ్యాప్తంగా రుణమాఫీ పథకంలో లబ్దిదారుడిగా ఎంపికై రేషన్ కార్డు లేని రైతుల వివరాలను సేకరించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సంతోష్ బుధవారం తెలిపారు. మండల పరిధిలోని యూబిఐ, ఎస్‌బిఐ, ఇండియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకుల నుంచి రుణాలు పొంది రేషన్ కార్డులు లేని 573 మంది రైతులను గుర్తించడం జరిగిందన్నార. వ్యవసాయ అధికారులు నేరుగా రైతుల ఇంటి వద్దకు వచ్చి కుటుంబసభ్యుల వివరాలను నిర్ధారణచేసుకొని సంబంధిత అప్లికేషన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. అలాగే రైతు కుటుంబసభ్యులతో కూడిన ఫోటోను సేకరించి రైతు ధృవీకరణ పత్రంపై సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. రైతులు తమ గ్రామానికి కేటాయించినతేదీలలో అందుబాటులో ఉండాలన్నారు.

## పాడితో రైతులకు ఉపాధి

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పాడిపంటలు సక్రమంగా ఉంటేనే రైతు ఆర్థికంగా స్థిరపడతాడని చెప్పడం అతిశయోక్తి కాదు. పంటలు ప్రకృతి కనుకరించినప్పుడే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా చేస్తాయి. పాడి పరిశ్రమ మాత్రం కష్టపడి పని చేస్తే ప్రతి రోజు ఆదాయమే ఆదాయం సమకూరుతుంది. నేటి రోజుల్లో రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గుచూపుతున్నారు. కొద్దిపాటి వ్యవసాయ భూములు ఉన్న చిన్న, సన్నకారు రైతులు పాడి గేదెలను పంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. పాడి గేదెల వల్ల రెండు రకాల ప్రయోజనం కలుగుతుంది. పాడి ద్వార పాలను సేకరించుకుని ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు వ్యవసాయ పంటల దిగుబడికి అవసరమైన సేంద్రీయ ఎరువులను తయారు చేసుకోగలగుతారు. నారాయణఖేడ్ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో అనేక మంది రైతులు పాడి పశువులను పోషించడమే కాకుండా పాలతో ఉత్పత్తి అయ్యే పదార్థాలను తయారు చేసి వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా స్థిరపడుతున్నారు. ఒక పాడి గేదె రోజుకు రెండు సార్లు 10 లీటర్ల పాలను ఇస్తుంది. పాలలో వెన్న శాతాన్ని అనుసరించి రోజులకు 4వందల రూపాయల వరకు ఆదాయం అందుకుంటున్నారు. ఒక రైతు నాలుగైదు పాడి గేదెలను సాకితే నిత్యం మంచి ఆదాయం పొందవచ్చు.

## రుణమాఫీకై రైతుల ఇళ్లకు వ్యవసాయాధికారులు



చౌటకూరులో రైతులు ఇళ్లకు తిరుగుతున్న వ్యవసాయ అధికారులు

**చౌటకూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రుణమాఫీ కాని రైతులను గుర్తించేందుకు వ్యవసాయ అధికారులు బుధవారం రైతుల ఇండ్ల వద్దకు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. చౌటకూరులో మండల వ్యవసాయాధికారి ప్రవీణ, ఏఈఓ దత్తురాజ్‌లు బుధవారం రైతులు ఇండ్లకు చేరుకుని వివరాలు సేకరించారు. రేషన్‌కార్డు లేకపోవడం, ఆదార్ నమోదులో దొర్లిన తప్పులతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఇతరాత్ర ధృవపత్రాలు రైతుల వద్దలేకపోవడంతో రుణమాఫీ జాబితాలో పేర్లు రాలేకపోయాయి. రుణమాఫీ కాకపోవడంతో రైతులు రెండు మూడు రోజులుగా బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులుపడుతుండడంతో ప్రభుత్వం అధికారులను రైతుల ఇండ్లకు పంపి వివరాలు సేకరించేలా చర్యలు తీసుకున్నారు. ఒక కుటుంబలో ఎందరిపేర్లపై రుణాలు ఉన్నాయో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**నర్సాపూర్ ఆగస్టు 28. ప్రభాతవార్త :** నర్సాపూర్, మెదక్ పట్టణంలో గల తెలంగాణా మైనార్టీ గురుకులంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కై అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఎం డబ్ల్యువో జేమ్లానాయక్, ఆర్ఎల్‌సి సుధారాణి లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో టిజిటి ఇంగ్లీష్, పీజీటీ ఫిజికల్ సైన్స్, కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులు ఖాళీ ఉండగా మెదక్ గురుకులంలో పీజిటి బయోసైన్స్ పోస్టు స్త్రీలకు మాత్రమే ఉందని తెలిపారు. ఈ మేరకు అర్హులైన అభ్యర్థులు నర్సాపూర్‌లో గల మైనార్టీ గురుకులంలో ఈనెల 31 సాయంత్రం 5 గంటల లోగా తమ దరఖాస్తులు అందజేయాలని వారు తెలిపారు. దరఖాస్తు చేయగోరే అభ్యర్థులు బిఎడ్ తో పాటు సంబంధిత పిజీ చేసి ఉండాలని 3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఇంకా ఏదైనా సందేహాలున్నచో నర్సాపూర్ మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ ఫోన్‌నెంబర్ 9666724017కు ఫోన్‌చేసి సంప్రదించాలని వారు తెలిపారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, అగస్టు 28. ప్రభాతవార్త :** ఢిల్లీ లోని తెలంగాణా భవన్ లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బుదవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి కలిశారు. బెయిల్ పై వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎమ్మెల్యే సునీతారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి తో పాటు మహబూబాబాద్ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు